

# అనాథ

## మందరపు ఉమాలక్ష్మి

అప్పటివరకు సూర్యుడు తన ప్రతాపాన్ని చూపించి, నెమ్మది, నెమ్మదిగా పడమటి దిక్కుకి ఒరిగి పోతున్నాడు అది వేసవి కాలం అవడం వల్ల, చల్లగాలికి చాలా మంది ఆ పార్కుకి రాసాగారు

అప్పటికే సాయంత్రం ఆరు గంటలవడంతో ఆ పార్కంతా జన సందోహంతో నిండి పోయింది కొంత మంది సిమ్మెంటు బెంచీలమీద కూర్చుని మాట్లాడు కుంటున్నారు మరి కొంతమంది వారపత్రికలు చదువు కుంటున్నారు కొందరు జంటలుగా వచ్చి చెట్ల చాటున పచ్చ గడ్డిలో కూర్చుని గుసగుసలాడు కుంటున్నారు చిన్న పిల్లలు అక్కడున్న జారుడు బల్ల ఎక్కి జారుతున్నారు మరి కొందరు రంగులరాట్నం ఎక్కి సంతోషంతో కేరింతలు కొడుతున్నారు

అక్కడున్న వారందరి ముఖాల్లో సంతోషం తాండవిస్తోంది ఆ పార్కులో ఒక ప్రక్కగా ఉన్న సిమ్మెంటు బెంచీ మీద కూర్చున్న రామారావు మనసు మాత్రం ఆందోళనతో నిండి పోయింది అతడి చూపుల్లో ఆరాటం, మనసులో ఆందోళన నిండి ఉండడంతో చీటికి మాటికి, పార్కు గేటు వైపు చూస్తున్నాడు ఏ క్షణానైనా తన స్నేహితుడు వస్తాడేమోనని, ఆశగా చూస్తున్నాడు కానీ అతడి జాడ లేదు

అసలు ఈ రోజు ఇంత ఆలస్యం చేసే రేమిటి? ఎప్పుడూ తనకన్నా ముందే వచ్చి ఈ పార్కులో కూర్చునే కృష్ణారావు ఇంతవరకు అయిపు లేడంటే మహా ఆశ్చర్యంగా వుంది

అతడి మనసంతా కృష్ణారావు గురించిన ఆలోచనలతో నిండి పోయింది

తనకి, కృష్ణారావుకి పరిచయమై ఆరు నెలలు అయ్యింది ఈ ఆరు నెలల కాలంలోనూ, తనూ, కృష్ణారావు కలుసుకోకుండా ఒక్క రోజు కూడా ఉండలేదు ఈ వయసులో అతడితో స్నేహం నిజంగా తన అదృష్టమే!

అసలు తనకి, కృష్ణారావుకి పరిచయం విచిత్రంగా జరిగింది తమ కిద్దరికి పరిచయం జరిగింది, స్నేహం పెరిగింది ఈ పార్కులో నే

ఆ రోజు తనకింకా గుర్తు!

తను ఇలాగే చల్లగాలికి పార్కుకి వచ్చి కూర్చున్నాడు ఆ వేళ కూడా పార్కులో ఎక్కువ జనమే నిండి వున్నారు తను ఆలోచిస్తూ సిమ్మెంటు బెంచీ మీద కూర్చున్నాడు

ఇంతలో పార్కులో గలాటా మొదలయ్యింది

ఏమైందో చూద్దామని తనూ అటు నడిచాడు

అక్కడ ఒక పన్నెండేళ్ళ కుర్రాడిని పట్టుకొని, అందరూ దొంగ, దొంగ అని చితకబాదుతున్నారు

ఆ పిల్లాడు నేను దొంగతనం చెయ్యలేదు నా మాట వినండి నేను దొంగని కాను నన్ను నమ్మండి అని ఏడుస్తూ కళ్ళు తుడుచుకుంటున్నాడు

నోర్ముయ్ వెధవా! అతిగా వాగావంటే, పోలీసులకి అప్పజెబుతాను మర్యాదగానా పర్సు ఇయ్యి అంటున్నాడు ఆ కుర్రాడినిపట్టుకున్న వ్యక్తి

ఇంతలో ఒక వ్యక్తి ఆ గుంపును త్రోసుకుంటూ వచ్చి, ఎందుకు ఆ కుర్రాడిని అలా కొడుతున్నారు? అని అడిగాడు

'ఈ దొంగ వెదవ, నా వెనకే, బాబూ! ఆకలి ధర్మం చెయ్యండి' అని తిరిగి నా జేబు కొట్టేసాడు అన్నాడు ఆ వ్యక్తి కోపంగా!

ఆ కుర్రాడు మీ జేబు కొడుతుండగా పట్టుకున్నారా?

లేదు ఈ దొంగ వెధవ అంత తేలిగ్గా దొరుకుతాడా! నా పర్సు కొట్టేసి, ఎటో పరిగెత్తబోయాడు చప్పున పట్టుకున్నాను

నేను దొంగతనం చెయ్యలేదు బాబూ! అల్లా బెంచీకాడ, కూకున్న బాబు రొట్టిముక్క పారేస్తే, కుక్క లాగేసుకుంటాదని, పరిగెత్తబోయాను అన్నాడు ఆ కుర్రాడు వెక్కిళ్ళ మధ్య!

చూసారా! ఎలా అబద్ధాలు చెప్తున్నాడో! మరి నాలుగు తగలనిస్తే గాని, బుద్ధి రాదు అని కొట్టడానికి చెయ్యెత్తాడు

అనవసరంగా ఆ పిల్లాడిని కొట్టకండి ఈ పర్సు మీదేనా!' అని తన జేబులో పర్సు తీసి, అతడికి చూపించాడు కృష్ణారావు

ఆఁ ఇది నాదే! ఇది మీ దగ్గర కెలా వచ్చింది?

'ఇందాక మీరు నా ప్రక్కన కూర్చున్నారు చూడండి అప్పుడు పొరపాటున మీరు అక్కడ మర్చిపోయారు- ఇందాకటి నుండి మీ కోసం వెతుకుతున్నాను

థాంక్యూ సర్! అన్నాడతడు కృతజ్ఞతగా!

'ముందు వెనకా ఆలోచించకుండా అనవసరంగా ఆ కుర్రాడి మీద చెయ్యి చేసుకున్నారు ఆ పిల్లాడి దరిద్రం, ఆకలే మీ దృష్టిలో ఆ కుర్రాడిని నేరస్తుడిని చేసాయి

'ఐయామ్ సారీ!' అని ఆ వ్యక్తి అక్కడి నుండి వెళ్ళిపోయాడు

'బాబూ! ఆకలిగా వుందా? ఈ పది రూపాయలు తీసుకొని కడుపునిండా భోజనం చెయ్యి అని ఆ కుర్రాడి చేతిలో పది రూపాయలు పెట్టి అక్కడ నుండి కదిలాడు కృష్ణారావు

ఆ దృశ్యాన్ని చూసిన తన మనసు చలించి పోయింది ఈ రోజుల్లో కూడా ఇంత మంచి వ్యక్తులున్నారా అని క్షణకాలం ఆశ్చర్య పోయాడు

అంతే! ఆ క్షణంలో నే అతడిని అభినందించి, తన ఆనందాన్ని వ్యక్త పరిచాడు

ఆ క్షణం నుండి కృష్ణారావు 'తన మిత్రుడై పోయాడు తనూ కృష్ణారావు, ఒకరి నొకరు చూసుకోకుండా, ఒకరితో ఒకరు మాట్లాడుకోకుండా ఒక్క రోజైనా ఉండ లేదు

అసలు కృష్ణారావు ఎందుకు రాలేదో! తనే వెళ్ళి కనుక్కుంటే గాని, సంగతి తేలేటట్లు లేదు' అని ఆలోచిస్తూ లేచి నిల్చున్నాడు

అప్పటికే ఏడు గంటలు అవడంతో పార్కులో జనం పల్చబడ్డారు అప్రయత్నంగా వాచీ చూసుకొని, తను కృష్ణారావు గురించి, ఆలోచిస్తూ ఇంత సేపు కూర్చున్నాడా అని ఆశ్చర్యపోయి, ఇక అక్కడ ఉండడం ఇష్టంలేక ఆ పార్కు గేటు దాటాడు

* * * * *

అప్పటికే ఎనిమిది గంటలు అవడంతో, ఆ వీధంతా నిద్ర పోతున్నట్లుంది ఊరికి కాస్త దూరంగా ఉండే ఆ వీధిలో ఎక్కువ మనుష్య సంచారం ఉండదు సిటీ బస్సుల, మోటారు సైకిళ్ళ రణగొణ ధ్వనులేవీ లేకుండా అతి ప్రశాంతంగా ఉంటుందా వీధి ఆ వీధిలో అక్కడక్కడా స్ట్రీట్ లైట్లు వెలుగు తున్నాయి

రిక్షాలో కూర్చుని, ఆ వీధిని పరిశీలనగా చూస్తున్న రామారావు, రిక్షా సడన్‌గా ఆగిపోవడంతో, ఆశ్చర్య పోయి ఏదో అనబోయాడు

దిగండి బాబూ! కృష్ణారావు బాబుగారి ఇల్లొచ్చేసింది అన్న రిక్షావాడి పిలుపుతో, తనలోని ఆలోచనలకు తనే చిన్నగా నవ్వుకొని రిక్షా దిగాడు

ఆ వీదిలో కెల్లా అందమైన మేడ, పెద్ద మేడ కృష్ణారావుదే! ఇంటి ముందు పెద్ద ప్రహరీ గోడ, ఆ ప్రహరీలో అందమైన గులాబి చెట్లు, ఆకుపచ్చ తివాచీ పరచి నట్లుండే పచ్చటి లాన్, అతడి మనసు దోచుకున్నాయి ఒక్క క్షణం

ఆ ఇంటి వరండాలో వెలిగే మెర్క్యురీ లైటు కాంతి, ఆ చుట్టు ప్రక్కలంతా వ్యాపిస్తోంది ఆ ఇల్లు అతి నిశ్శబ్దంగా వుంది

ఏమిటి? కృష్ణారావు అప్పుడే నిద్రపోయాడా! ఇంత రాత్రివేళ వచ్చి, తను అతడిని డిస్టర్బ్ చెయ్యడం లేదు కదా! ఏమిటో అతడిని చూడాలన్న ఆరాటం, తనని పిచ్చివాడిని చేసింది ' ఆలోచిస్తూ బజర్ నొక్కాడు

ఎవరూ పలక లేదు

మరి రెండుసార్లు బజర్ మ్రోగించాడు

కానీ ఎవరూ పలక లేదు

అప్పుడు చూసాడు ఆ ఇంటి తలుపుకి తాళం వేసి ఉండడం

అరె! కృష్ణారావు తనతో చెప్పకుండా ఏ ఊరైనా వెళ్ళాడా! తను అతడి ఆలోచనలో పడి, ఎంత పిచ్చిగా ప్రవర్తిస్తున్నాడు తాళం వేసి ఉన్నది చూడకుండా పిచ్చివాడిలా బజర్ మ్రోగించాడు' అని తనలో తనే చిన్నగా నవ్వుకొని, ఆ ఇంటి గుమ్మం దాటబోయాడు

ఇంతలో ఎవరు బాబూ! అన్న ఒక ముసలి వ్యక్తి కంఠం విని, కృష్ణారావు గారి కోసం వచ్చాను ఆయిన లేరా! అని అడిగాడు

మీకు తెలవదా బాబూ! ఆ బాబుని స్కూటరు గుద్దేసింది సానా రక్తం పోయింది పెద్దాసుపత్రిలో ఏసారు అన్నాడు ఆ తాత వణికే కంఠంతో!


అతడి మాట వినడంతోనే, రామారావుకి కాళ్ళ క్రింద భూమి కదిలినట్లయ్యింది ఒక్క క్షణం కళ్ళు చీకట్లు క్రమ్మినట్లయ్యింది

ఇక అక్కడ ఉండడం ఇష్టంలేక, భారమైన మనసుతో అక్కడి నుండి కదిలాడు

* * * * *

మూడు రోజులుగా కృష్ణారావు ఆస్పత్రిలో స్పృహ లేకుండా పడి ఉన్నాడు రామారావు అనుక్షణం కృష్ణారావు దగ్గరే ఉండేవాడు ఈ మూడు రోజులు, కృష్ణారావుతో బాటు, రామారావు కూడా నిద్రాహారాలకి దూరమయ్యాడు

కృష్ణారావుకి ఆ రోజే స్పృహ వచ్చింది కానీ మనిషిలో ఏమాత్రం ఓపికా లేదు చాలా రక్తం పోవడం వల్ల, బాగా నీరసించి పోయాడు కళ్ళు విప్పి చూస్తున్నాడే తప్ప, నోరు తెరచి మాట్లాడలేక పోతున్నాడు స్పృహ వచ్చినప్పుడు కళ్ళు తెరిచి చూసేవాడు తర్వాత మగతలోకి జారిపోయే వాడు అతడికి అర్జంటుగా రక్తం ఎక్కిస్తే గానీ, మనిషి దక్కడని, డాక్టర్లు చెప్పడంతో రామారావుకి మతిపోయి నట్లయ్యింది తన ఒంట్లో రక్తం తీసుకొని, అతడిని బ్రతికించమని, డాక్టర్లని వేడుకున్నాడు కానీ అతడి గ్రూపు రక్తం, కృష్ణారావు



రక్తానికి సరిపడలేదు ఆస్పత్రిలో అతడి గ్రూపుకి సంబంధించిన రక్తం నిల్వలేక పోవడంతో, పెద్ద సమస్య వచ్చింది

ఎవరైనా అతనికి రక్తాన్ని ఇస్తే, తప్పకుండా బ్రతుకుతాడని డాక్టర్లు చెప్పారు

కానీ కృష్ణారావుకి రక్తాన్ని ఇచ్చేవాళ్ళు ఎవరున్నారు? అతడి తరఫు బంధువు లెవరూ లేరు అతడికి పుట్టిన బిడ్డలూ లేరు ఈ కష్ట కాలంలో కడుపున పుట్టిన బిడ్డలుంటే, ఎంతగా ఆదుకునే వారో! కానీ పాపం కృష్ణారావు దురదృష్టవంతుడు భార్యని, బిడ్డల్ని పోగొట్టుకొని, అనాథగా మిగిలి పోయాడు

ఈ ప్రపంచంలో ఏ వ్యక్తికీ అంతటి దురదృష్టం పట్టకూడదు పిల్లలు లేకుండా, అనాథగా మిగిలిపోయి, దిక్కులేని చావు చచ్చి పోవడం కంటే వేరే నరకం మరొకటి లేదు

ఈ వయసులో తను కూడా ఒంటరిగా ఉంటున్నాడు తులసి అన్నట్లు ఈ ఊరు వదలి తామిద్దరూ ఏ కొడుకు దగ్గరకో వెళ్ళిపోతే మంచిది తనకి మాత్రం ఈ ఊర్లో ఎవరున్నారు? ఉన్న పొలాన్ని, ఇంటిని అమ్మేసి, హాయిగా పెద్దాడి దగ్గరకు వెళ్ళిపోతే తనని కళ్ళల్లో పెట్టుకుని చూసుకొంటాడు కొన్నాళ్ళు పెద్దవాడి దగ్గర, మరి కొన్నాళ్ళు చిన్నకొడుకు దగ్గర ఉంటే, తమ ఇద్దరి బ్రతుకులు తెల్లవారి పోతాయి తనకీ వయసు మళ్ళింది ఏ క్షణంలో ఏం జరుగుతుందో, ఎవరు

# అనాథ

చెప్పగలరు? తనకేమైనా అయితే, ఒంటరి ఆడది తులసి, ఏం చెయ్యగలదని? ఏమిటో ఈ మధ్య తన ఆరోగ్యం కూడా బాగుండడం లేదు బిడ్డలుండి కూడా తను ఇంకా ఈ ఊరు పట్టుకొని వ్రేలాడడం మంచిది కాదు

కృష్ణారావు కూడా తనతో ఎన్నోసార్లు అనేవాడు ఈ వయసులో మీకెందుకండీ ఈ బాధలన్నీ హాయిగా ఏ కొడుకు దగ్గరకో వెళ్ళి, కాలు మీద కాలు వేసుకొని కూర్చోక నా కంటే ఎటూ ఎవ్వరూ లేరు, బిడ్డలున్న మీరు కూడా ఎవరూ లేనట్లు, ఇక్కడ పడి ఉండడం దేనికి?' అని

దానికప్పుడు తను చిన్నగా నవ్వేవాడే గాని, పట్టించుకునే వాడు కాదు కానీ ఈ రోజు కృష్ణారావు పరిస్థితి చూస్తుంటే, తనకి భయమేస్తుంది అందుకే రేపే తను వాళ్ళిద్దరికీ ఉత్తరాలు వ్రాయాలి ముందుగా తమని ఎవరి దగ్గరికి రమ్మంటారో! ఆలోచిస్తూ నిద్రలోకి ఒరిగిపోయాడు రామారావు

★ ★ ★ ★

ఈ మూడు రోజులుగా కృష్ణారావుని చూడ్డానికి ఎంతో మంది వచ్చి, పోతున్నారు కృష్ణారావుకి ఆ ఊర్లో ఉన్న పలుకుబడికి ఆశ్చర్యపోయాడు రామారావు కృష్ణారావు బ్రతకాలని, కొందరు పూజలు చేయించి, ఆ కుంకుమ అతడి నుదుటన పెడుతున్నారు

ఈ మూడు రోజులుగా, అతడి పిలుపు కోసం, చకోరాల్లాగ ఎదురు చూసిన వాళ్ళు, కృష్ణారావుకి స్పృహ వచ్చిందనేసరికి, ఎంతో సంతోష పడిపోయారు కృషారావుకి రక్తం కావాలని తెలిసేసరికి, రక్తం మేమిస్తామంటే, మేమిస్తామంటూ ఎందరో ముందుకు వచ్చారు

క్షణ కాలం క్రిందట కృష్ణారావుకి ఎవరూ లేరు, అనాథ అని విచారించిన, రామారావు మనసు ఈ సంఘటనతో కుదుట పడింది

కృష్ణారావుకి రక్తదానం చేసి, అతడిని బ్రతికించుకున్నారు ఆ ఊరి ప్రజలు

కొద్ది రోజుల్లోనే అతడి ఆరోగ్యం కుదుట పడింది

★ ★ ★ ★

కాల గమనంలో మరో ఆరు నెలలు సునాయాసంగా గడిచిపోయాయి

ఇప్పుడు కృష్ణారావు ఆరోగ్యం పూర్తిగా కుదుటబడడంతో, మళ్ళీ సాయంత్రం వేళ పార్కుకి వెళ్ళడం మొదలు పెట్టేడు

ఎప్పటిలానే కృష్ణారావు, రామారావు ఆ పార్కులో కలుసుకుంటున్నారు ఒకరి కష్టసుఖాలు ఒకరు చెప్పుకుంటున్నారు ఒకరితో మరొకరు ఆప్యాయంగా మాట్లాడుకుంటున్నారు అరవయ్యోపడిలో పడినా, ఇద్దరూ చలాకీగా, హుషారుగా తిరుగుతున్నారు

ఆ రోజు రామారావు ముభావంగా, దిగులుగా




ఉండడం చూసి, ఏమిటండీ! ఈ రోజు మీరు దిగులుగా కనిపిస్తున్నారు మీ మనసులో బాద ఏమిటో నాతో చెప్పకూడదా! అన్నాడు కృష్ణారావు

చెప్పడానికే ముందండీ ఆ మధ్య, తులసి నానా గొడవ చేస్తే, పెద్దాడికి, చిన్నాడికి ఉత్తరాలు వ్రాసాను దానికి వాళ్ళు ఇంత కాలానికి జవాబిచ్చారు

ఏదో పని గొడవల్లో పడి, ఉత్తరం వ్రాయడం ఆలస్యం చేసారేమో! దానికి మీరు బాధ పడడం అనవసరం అన్నాడు కృష్ణారావు

నేను దానికి బాధపడ లేదండీ, అసలు వాళ్ళ ఉత్తరాలు వ్రాయకపోయినా సంతోషించేవాడిని

ఏమిటండీ? అసలు ఏం వ్రాసారు?

తులసికి కొడుకు, కోడళ్ళ దగ్గర, మనవల దగ్గర ఉండాలని ఆరాటం దానికి నేను సరేనన్నాను దిక్కులేని పక్షుల్లా ఇక్కడ ఉండడం కన్నా, పిల్లల దగ్గర కెళ్ళిపోతే, సుఖంగా ఉంటుందని, మేమిద్దరం మీ దగ్గరకి రావాలనుకుంటున్నాం మీ అభిప్రాయాలు చెప్పండి అని ఉత్తరాలు వ్రాసాను దానికి వాళ్ళేం వ్రాసారో తెలుసాండీ అన్నాడు గద్గద స్వరంతో

ఏమన్నారు? ఆతృత పెరిగింది కృష్ణారావులో!

పెద్దకొడుకు, మా ఇద్దర్లో ఎవర్నో ఒకర్నే భరించగలనని వ్రాసాడు తామిద్దరూ ఉద్యోగానికి వెళ్ళిపోతారు కాబట్టి, పిల్లల్ని చూసుకోవడానికి, ఇంటి పనులు చేసుకోవడానికి, అమ్మని పంపిస్తే బాగుంటుందని వ్రాసాడు

అంత మాట అన్నాడా

'చిన్నకొడుకు కమల్ అసలు మమ్మల్నిద్దరినీ తన దగ్గరికే రావద్దన్నాడు వాడు మరి కొద్ది నెలల్లో బొంబే వెళ్ళిపోతాడట! అక్కడికి మమ్మల్ని, ఇద్దరిని తీసుకు వెళ్ళడం శ్రమతో కూడిన పనట! అంతగా అయితే వాళ్ళన్నయ్య దగ్గరకి వెళ్ళిపొమన్నాడు తన వంతుగా ఇద్దరి ఖర్చులకుగాను వంద రూపాయలు పంపుతాడట!

చూశారా! నా బిడ్డ లిద్దరూ రత్నాల్లాంటి వాళ్ళని, పెద్ద ఉద్యోగాలు చేసుకుంటున్నారని, ఇన్నాళ్ళు సంతోషపడ్డాను ఇప్పటికి వాళ్ళ నిజ స్వరూపం బయటపడింది వాళ్ళు అసలు నా బిడ్డలే కాదనుకుంటాను పుట్టిన బిడ్డలు పురిట్లోనే చచ్చిపోయారనుకుంటాను అంతేగాని, కన్న కొడుకు దగ్గరకే, పనిమనిషిలా నా భార్యని అక్కడికి పంపలేను అభిమానాన్ని చంపుకొని, నేను వాళ్ళ దగ్గరికి వెళ్ళలేను నేను వాళ్ళ దగ్గర నుండి ఆశించింది ఆప్యాయత, అభిమానం ఆ రెండూ వాళ్ళు ఇవ్వలేకపోయినప్పుడు, ఇక నేను అక్కడికి వెళ్ళి ప్రయోజనమేమిటి?' ఆవేశంగా అన్నాడు రామారావు

మీరు చెప్పిన విషయాలు వింటుంటే, చాలా బాద వేస్తుంది బిడ్డలుండిమీరు, బిడ్డల్లేక నేను అనాథ ల్లాగ మిగిలిపోయాం నిట్టూరుస్తూ అన్నాడు కృష్ణారావు.

'లేదండీ! మీరు అనాథ కారు మీకు బిడ్డల్లేకపోయినా, మీ కోసం సర్వం సమర్పించడానికి సిద్ధంగా ఉన్నారు ఈ ఊరి ప్రజలు మీ మంచితనమే మీకు శ్రీరామరక్ష మీ దయాగుణమే మీకు కొండంత అండ మీకున్న కీర్తి ప్రతిష్టలే మిమ్మల్ని పూలరథం మీద నడిపిస్తాయి నాలాంటి అనామకుడు, బిడ్డలుండి కూడా దగాపడ్డ, విధి వంచితులు మాత్రమేనండి, ఈ లోకంలో అనాథలుగా మిగిలిపోతారు" గద్గద స్వరంతో అన్నాడు

'నో మీరెప్పుడూ అలా అనుకోవద్దు ఈ కృష్ణారావు బ్రతికి ఉన్నంత కాలం మీరు అనాథ కారు మీరు నాకు స్వంత అన్నదమ్ముడితో సమానం మీకే కష్టమొచ్చినా, ఈ కృష్ణారావు ఉన్నాడని మరచిపోకండి!

"ఈ జీవితంలో మిగిలింది, మీలాంటి సహృదయుల స్నేహమే పదండి ఇప్పటికే చాలా సమయం అయ్యింది' అని లేచాడు రామారావు తేలిక పడ్డ మనసుతో

ఇద్దరూ ఒకరి భుజాల మీద, మరొకరు చేతులు వేసుకొని, ఆ పార్కు దాటి వెళ్ళిపోయారు □

# ఈ వేమన పద్యాలు




ముందరి పోటుల మాన్పను
మందెంధైనను గలదుర మహిలో పలనే
నిందెల మాటల మాన్పను
మందెంధైనను గలుగదు మహిలో వేమ.